గుట్టలో అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట, మార్చి 28 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధ పాతగుట్ట(పూర్వ గిరి) ఆలయంలో గురువారం స్వాతీనక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి గంగాది, సప్తనదీ జలాలు, మామిడి, తమల పాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతో పాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూల మంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులకు వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణపుష్పాలతో అర్చించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహ స్వామిని మేల్కొలిపి, తిరువారాధన, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.22,67,255 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నిరంజన్‌వలీ

- ఎంపీడీఓ నిరంజన్‌వలీ

ఆత్మకూరు(ఎం), మార్చి 28 : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నిరంజన్‌వలి ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి రోజు నీటిని అందించే విధంగా బోర్లను అద్దెకు తీసుకోవడంతో పాటు చేతి పంపులకు మరమ్మతు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్ ఎండీ. షఫియొద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగసాయి, ఐబీ డీఈ సునీల్ ప్రసాద్, ఎంపీఓ పద్మావతి, మండల పశువైద్యాధికారి గిరి, గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

ప్రభుత్వ ఉన్నత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సుగుణమ్మను సన్మానిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

ఆత్మకూరు(ఎం), మార్చి 28 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్‌పర్సన్‌గా సగ్గు సుగుణమ్మ ఎన్నికైనట్లు ఏపీఎం కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా సుగుణమ్మను మహిళా సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అరుణ, వినోద, పద్మ, బాలమణి, రోహిణి, సంధ్య, సుశీల, రేణుక, నర్సమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

దత్తాయపల్లిలో వైద్య శిబిరం

వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తుర్కపల్లి, మార్చి 28 : మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ భువనగిరి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్ శిబిరాన్ని ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు. వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బాలాజీ, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ సిటీ, మార్చి 28 : సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో విద్వేషకర తప్పుడు పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను ప్రజలు నమ్మవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని విద్వేషకర పోస్టులు పెట్టిన వారి సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

బీబీనగర్, మార్చి 28 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వచ్చే విద్యా సంవత్సరానికి 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు గడవును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు యాదాద్రి రీజియన్ సమన్వయ అధికారిని ఎన్. రజని, కళాశాల ప్రిన్సిపాల్ కల్పన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 21 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గాల ఎన్నిక

భువనగిరి అర్బన్, మార్చి 28: భువనగిరి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జరిగాయి. బార్ అసోసియేషన్‌లో 141 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉండగా 129 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడి బరిలో ఉన్న బబ్బూరి హరినాథ్‌కు 95, రవీందర్‌రెడ్డికి 34 ఓట్లు రాగా 61 ఓట్ల మెజార్టీతో హరినాథ్‌గౌడ్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడి బరిలో నిలిచిన కలకుంట్ల జయకు 66, జగన్‌మోహన్‌రెడ్డికి 62 ఓట్లు రాగా, ఒక ఓటు చెల్లలేదు. 4 ఓట్ల తేడాతో కలకుంట్ల జయ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జిట్ట భాస్కర్‌రెడ్డి ప్రకటించారు. దాంతో పాటు ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణ, సహాయకార్యదర్శిగా ఎం. వెంకటేశ్, సాంస్కృతిక కార్యదర్శిగా బి.కిషన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్త కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ సభ్యులను బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్, ఉపాధ్యక్షురాలు జయ, సభ్యులు

పరమేశ్‌ను అభినందిస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తాడూరి

చౌటుప్పల్, మార్చి 28 : చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తాడూరి పరమేశ్ ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యవర్గంలోని ప్రధాన పోస్టులు ఏకగ్రీవంకాగా ఉపాధ్యక్ష పదవి కోసం ఇద్దరు పోటీ పడడంతో గురువారం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 39 ఓట్లకు గానూ పరమేశ్‌కు 27 ఓట్లు, గంగాదేవి రవీందర్‌కు 12 ఓట్లు వచ్చాయి. దాంతో 15 ఓట్ల మెజార్టీతో పరమేశ్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

రామన్నపేట అధ్యక్షుడిగా మజీద్

రామన్నపేట : రామన్నపేట బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ మజీద్, ఉపాధ్యక్షుడిగా గాలి లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా కేమ రామదాసు, సహాయ కార్యదర్శిగా దంతూరి సత్తయ్య, లైబ్రరీ, కల్చరల్ కార్యదర్శిగా సుక్క శ్రవణ్‌కుమార్, కోశాధికారిగా మామిడి వెంకట్‌రెడ్డి, సభ్యులుగా సంగిశెట్టి బాలరాజు, స్వామి, దినేశ్ ఎన్నికయ్యారు.

ఎంఏ మజీద్

మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 28 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోలుపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 1న జిల్లా వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 3.55 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకు 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 158, పీఏసీఎస్ 63, డీసీఎంసీ కేంద్రాలు 15 ఉంటాయన్నారు. తేమ శాతం కొలిచే మిషన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వేసవిలో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టి తీసుకొచ్చేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల బ్యాంక్ ఖాతాలు తీసుకునే సమయంలో ఐఎఫ్ఎస్‌సీ కోడ్ పరిశీలించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే ఫ్లెక్సీల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు ఉండకూడదని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎస్ఓ మోహన్‌బాబు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఏసీఓ పద్మ, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీఓలు సూర్యనారాయణ, వేణుమాధవ్, డీఎంఓ శర్మ, ఆర్టీఓ సురేశ్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం రాములు, తాసీల్దార్లు, మిల్లుల యజమానులు, ఐకేపీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

భువనగిరిఅర్బన్, మార్చి 28: మహిళ హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ భువనగిరి కోర్టు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె. మారుతీదేవి గురువారం తీర్పునిచ్చారు. కేసు వివరాలు.. జనగాం జిల్లా దేవరుప్పుల మండలం, దామరగడ్డ గ్రామానికి చెందిన చౌడబోయిన లక్ష్మి భర్త మృతి చెందగా ముగ్గురు కూతుళ్లతో కలిసి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ సమీపంలోని నందినగర్‌లో 2020లో నివాసం ఉండేది. అదే ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించే తన గ్రామానికి చెందిన ఆరె కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి కుమార్ తరచుగా ఆమె ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో చౌడబోయిన లక్ష్మిని మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలు పెట్టాడు. దించసాగడు. కొన్ని విషయాలు మాట్లాడుకుందామని చెప్పి కుమార్ లక్ష్మిని 11 నవంబర్, 2020న ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడు. మరుసటిరోజు భువనగిరి పట్టణ పోలీసులు లక్ష్మి మృతి చెందినట్లు ఆమె కూతురుకు సమాచారం ఇచ్చారు. ఆమె కూతురు కీర్తన తన తల్లి మృతికి ఆరె కుమార్ కారణమంటూ భువనగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆరె కుమార్‌ను అరెస్ట్ చేసి భువనగిరి కోర్టుకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తులో వరంగల్-హైదరాబాద్ హైవే రోడ్డు మార్గంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి చౌడబోయిన లక్ష్మి గొంతుకోసి, రాయితో తలపై కొట్టి హత్య చేసినట్లు ఆరె కుమార్ ఒప్పుకున్నాడు. దాంతో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి రూ.వెయ్యి జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు పట్టణ సీఐ ఎ.సుధాకర్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నలుగురికి జైలు

వలిగొండ, మార్చి 28 : వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నలుగురు నిందితులకు మూడు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ బుధవారం భువనగిరి అదనపు సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన కారంపూడి ప్రసాద్ భార్యను కాపురానికి పంపకుండా అత్తా, మామలు, బావ మర్ది వేధింపులకు గురి చేశారు. వారి వేధింపులు తట్టుకోలేక అతను 2018లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో డింగరి శేషాచార్యులు, డింగరి శ్రీదేవి, డింగరి ఫణి కుమార్, కారంపూడి రోజలపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. కేసును విచారించిన జడ్జి నలుగురిని దోషులుగా నిర్ధారించి 3 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.5 వందల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

- రైతుసంఘం నాయకుడు రామచంద్రారెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి28 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణ మాఫీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులందరికీ రైతుబంధు డబ్బులు అందించాలన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో రైతుల పథకాలను ఆపడం సరికాదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన రైతు చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు యత్నిస్తుందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, నాయకులు ప్రసాదం విష్ణు, మంచాల మధు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 28 : ప్రజలు ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 వరకు ఆస్తి పన్ను బకాయిల అపరాధ రుసుములో 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. బకాయిదారులు ఈ నెల 31లోపు ఆస్తి పన్ను బకాయిలను మున్సిపల్ కార్యాలయంలో చెల్లించి రసీదు పొందాలని సూచించారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు సంతోష్

ఆలేరురూరల్, మార్చి 28 : టెట్ అర్హత ఫీజు తగ్గించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు పరిదె సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని రాఘవాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో టెట్ ఒక పేపర్‌కు రూ.200 ఫీజు ఉండగా దానిని రూ.1000కి పెంచారన్నారు. రెండు పేపర్లు రాసే వారికి గతంలో రూ.300లు ఉండగా నేడు రూ.2వేలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత పరీక్షలకు ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని ఎన్నికల ముందు నిరుద్యోగులకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆన్‌లైన్ పరీక్ష ఫీజు పేరిట వేల రూపాయలు వసూలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే టెట్ దరఖాస్తు ఫీజునను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు కరికె మల్లేశ్, నమిలె రాజశేఖర్, ఎర్రోజు రాజలింగం, దేవుని దయాకర్, శ్రీరాముల రాజు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, మార్చి 28 : మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వనం సుమన్ (24) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లేపల్లి గ్రామానికి చెందిన వనం సుమన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 27న బైక్ పై వనస్థలిపురంలోని బంధువుల పెళ్లికి వెళ్లి రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. రెడ్డి నాయక్‌తండా వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దాంతో తీవ్రంగా గాయపడిన సుమన్‌ను స్థానికులు, బంధువులు 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బీబీనగర్, మార్చి 28 : పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామానికి చెందిన మిర్యాల నర్సింహ (26) గురువారం బీబీనగర్ పట్టణంలోని పంచముఖి వెంచర్‌లో విద్యుత్ స్తంభానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడు వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తల్లి మిర్యాల చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

మోత్కూరు, మార్చి 28: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుందని, రైతులు తొందరపడి దళారులకు ధాన్యం విక్రయించి మోస పోవద్దని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాసంగి వరి కోతలు మొదలయ్యాయని, రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు వే బ్రిడ్జీల వద్ద ధాన్యం తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తాలు పేరిట క్వింటాకు 2 కిలోల ధాన్యం తగ్గించడం, రూ.2 చొప్పున కమిషన్ వసూలు చేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నారని, వాటిని అరికట్టేందుకు మార్కెటింగ్, తూనికల కొలతల అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా కలెక్టర్లతో మాట్లాడినట్లు తెలిపారు. మోసాలకు పాల్పడే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను కోరినట్లు చెప్పారు.

ఆయన వెంట ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు రామచంద్రు, నాయకులు మల్లారెడ్డి, ఆనందమ్మ, నగేశ్, వీరస్వామి పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

వలిగొండ, మార్చి 28 : మండలంలోని మొగిలిపాక గ్రామంలో నిర్మించిన భ్రమరాంభ కేతమ్మ సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూదిమెట్ల బాలరాజు యాదవ్, ముద్దసాని కిరణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముద్దసాని శశికళారెడ్డి, గంట హరికృష్ణ, జడిగె సత్యరాములు, శంకరయ్య, భిక్షపతి, నర్సింహ పాల్గొన్నారు.

పోచంపల్లి బ్యాంక్ అభివృద్ధికి కృషి

- బ్యాంక్ చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం

భూదాన్ పోచంపల్లి, మార్చి 28 : పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి ఖాతాదారులు, వాటాదారులు కృషి చేయాలని బ్యాంక్ చైర్మన్ కర్నాటి బాలసుబ్రహ్మణ్యం కోరారు. గురువారం పట్టణ కేంద్రంలోని టై అండ్ డై ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బ్యాంక్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 మార్చి నాటికి బ్యాంక్ డిపాజిట్లు రూ.172.09 కోట్లు ఉండగా, 2024 ఫిబ్రవరి నాటికి రూ.197.87 కోట్లకు, బ్యాంక్ వ్యాపారం ఏడాది కాలంలో రూ. 281.80 కోట్ల నుంచి రూ. 315.83 కోట్లకు చేరినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో 8 బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు ఆర్బిఐకి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సమావేశంలో బ్యాంక్ మాజీ చైర్మన్ కర్నాటి పాండు, టై అండ్ డై అధ్యక్షుడు భారత లవ కుమార్, ఉపాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, బ్యాంక్ వైస్ చైర్మన్ సూరపల్లి రమేశ్, సీఈఓ సీతా శ్రీనివాస్, డైరెక్టర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి

బీబీనగర్, మార్చి 28 : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కసిరెడ్డి ఇంద్ర, నాయకులు చెరుకు అచ్చయ్య గౌడ్, గండు వసంత బసవయ్య, చింతల శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్‌కు రిమాండ్

చౌటుప్పల్, మార్చి 28 : వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 25న చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన రాచకొండ పుష్పమ్మ వద్దకు వచ్చిన నిందితుడు ఆమెతో మాట్లాడుతూ మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపాయాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు మండలంలోని డి.నాగారం గ్రామానికి చెందిన సిలివేరు ప్రవీణ్‌గా గుర్తించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ చెప్పారు.

చెరువులో ఎద్దుల బండి బోల్తా..కాడెద్దులు మృతి

మోత్కూరు, మార్చి 28: చెరువులో ఎద్దుల బండి బోల్తా పడగా కాడెద్దులు మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని జామ చెట్లబావి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దబ్బెటి సురేశ్ ఎడ్లను కడిగేందుకు స్థానిక చెరువులోకి ఎడ్ల బండితో సహా తీసుకెళ్లాడు. చెరువులో ఉన్న గుంతలో ప్రమాదవశాత్తు బండి బోల్తా పడింది. దాంతో కాడెద్దుల జత నీటిలో మునిగింది మృతి చెందాయి. దాంతో రూ.1.2 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ : జడ్పీ సీఈఓ

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ప్రే